

వివేకానంద కల్యాణమండపం



మండపం రెంటల్ బోర్డు

మరమ్మతులు చేస్తామని... మూసేశారు

- వివేకానంద కల్యాణ మండపం స్వాధీనం చేసుకున్న జీవీఎంసీ
- నేటికీ మరమ్మతులు ప్రారంభించని అధికారులు
- ఫంక్షన్లు చేసుకునేందుకు స్థానికులకు ఇబ్బందులు
- ప్రభుత్వ ఆదాయానికీ లక్షలాది రూపాయల గండి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో భయాందోళనలు



వివేకానంద కల్యాణ మండప గోడపై పెరిగిన పిచ్చి మొక్కలు



మండపం ఆవరణలో మద్యం బాటిళ్లు

సీతమ్మధార : ఒకప్పుడు కల్యాణాలు.. రజస్వల ఫంక్షన్లు.. రాజకీయ పార్టీల సమావేశాలతో కళకళలాడిన కల్యాణ మండపం అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూతపడింది. కొన్ని నెలల కిందటి వరకు కళకళలాడిన మండపం నుంచి ప్రస్తుతం దుర్వాసన వస్తోందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా తయారైందో అర్థం చేసుకవచ్చు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇదీ జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపం దుస్థితి. ఘనత వహించిన జీవీఎంసీ జోన్ – 3 అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల గండి పడుతోంది. మేయర్ డీవీ సుబ్బారావు హయాంలో నక్కవానిపాలెంలో భవనం నిర్మించి వివేకానంద కల్యాణ మండపం అని పేరు పెట్టారు. దీన్ని 1990లో అప్పటి రెవెన్యూ శాఖ మంత్రి డీకే సమరసింహారెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి టెండర్లు పిలవడం ద్వారా కాంట్రాక్టర్లు ఈ కల్యాణ మండపాన్ని నిర్వహిస్తున్నారు. టెండరు ద్వారా ప్రభుత్వానికి నెలకు రూ.2 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. ఇక్కడ సభలు, సమావేశాలు, వివాహాలు నిర్వహించుకునే వారు రోజుకు రూ.14 వేలకు పైగా చెల్లించుకునే వారు. ప్రైవేటు ఫంక్షన్ హాళ్లతో పోల్చితే అద్దె తక్కువగా ఉండడంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలంతా ఈ కల్యాణ మండపాన్ని వినియోగించుకునే వారు.

ఏడాదిగా కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు

గత ఏడాది కల్యాణ మండపం కాంట్రాక్ట్ కాల పరిమితి ముగియడంతో జోన్ - 3 రెవెన్యూ విభాగం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరమ్మతులు చేశాక మళ్లీ టెండర్లు పిలుస్తామని అప్పట్లో గొప్పగా చెప్పారు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభించకపోవడం గమనార్హం. అప్పటి నుంచి ఇక్కడ వివాహాలు, ఫంక్షన్లు నిర్వహించుకోలేని పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల సీతమ్మధార, గాంధీనగర్, నక్కవానిపాలెం, టీపీటీ కాలనీ, కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, తదితర ప్రాంతాల ప్రజలు శుభకార్యాలు, సభలు, సమావేశాల కోసం ఈ కల్యాణ మండపాన్ని ఆశ్రయిస్తుండేవారు. ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాల్లోని కల్యాణ మండపాలకు వెళ్లాల్సి వస్తోందని... లేదంటే భారీగా డబ్బులు చెల్లించుకుని ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతో ఈ కల్యాణమండపం కొంత వరకు శిథిలావస్థకు చేరుకుందని... ప్రస్తుతం మరమ్మతులు చేయాలంటే భారీగానే డబ్బులు ఖర్చు అవుతాయని జీవీఎంసీ వెనకడుగు వేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ భవనం స్థానంలో కొత్తగా మరో భవనం నిర్మించాలని కూడా ఆలోచిస్తున్నారని తెలుస్తోంది.

జోరుగా అసాంఘిక కార్యలాపాలు



మండపం లోపల చెత్త, వ్యర్థాలు

కొంతకాలంగా వినియోగంలో లేని కల్యాణ మండపం వద్ద కనీసం సెక్యూరిటీ గార్డు లేరు. మండపానికి తాళం వేసే నాథుడు కూడా లేడు. ఫలితంగా చుట్టుపక్కల ఆకతాయి ఇక్కడ జూదం ఆడుతూ, మద్యం సేవిస్తూ, మండపాన్ని మరుగుదొడ్లుగా మార్చేశారు. నిత్యం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. జోన్ - 3 అధికారులు ఇప్పటి వరకు మరమ్మతుల పనులు చేపట్టకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే ఇక్కడ యువకులు, అసాంఘికశక్తులు తిష్ట వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణమండపం లోపల భాగం అంతా చిందరవందరగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జోన్ - 3 అధికారులు ఈ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి

నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతులు చేయించి ప్రారంభించాలి. గతంలో మండపంలో కల్యాణాలు నిర్వహించేవారు. ప్రస్తుతం మూతపడిపోవడంతో అధ్వానంగా తయరైంది. మండపం తలుపు తీసి వదిలేయడంతో ఆకతాయిలు మురుగుదొడ్లుగా మార్చేశారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి మండపానికి పూర్వ వైభవంగా తీసుకురావాలి.

– రామచంద్రరావు, నక్కవానిపాలెం

పూర్వ వైభవం తీసుకువాలి

వివేకానంద కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి పూర్వ వైభవం తీసుకురావాలి. అన్ని వర్గాల వారూ తక్కువ ధరలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అందుబాటులో ఉన్న కల్యాణమండపం ప్రస్తుతం అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. కల్యాణమండపం పాడవడంతో నిరుపయోగంగా ఉంది. జీవీఎంసీ కమిషనర్, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– ఎస్.నాగేశ్వరరావు, గాంధీనగర్

క్లుప్తంగా

వైభవంగా సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, అర్చకులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు సంప్రదాయం ప్రకారం వేదమంత్రోచ్ఛరణ మధ్య భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. తర్వాత సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మద్రిపాలెం : జీవీఎంసీ 50వ వార్డు సాయిరాం కాలనీలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాలు ప్రాంత ప్రజల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. సాయిరాం కాలనీలో నెలకొన్న సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కాలనీ ప్రజల చిరకాల కోరిక రోడ్డు నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సనపల వరప్రసాద్, శివసాగర్, సంకు వెంకటేశ్వరరావు, వెంకటరావు, పద్మజ, పప్పల సునీత పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



ప్రశంసాపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు

మురళీనగర్ : శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి సంస్థ చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్‌ను సీపీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.శ్రీనివాసరావు శనివారం సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ అంశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి సాధికారతకు సంస్థ చేస్తున్న కృషిని ఆయన మెచ్చుకున్నారు. కీర్తి పట్నాయక్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

తంత్ర స్పా కేంద్రంపై పోలీసుల దాడులు

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం జాతీయ రహదారి సమీపంలో తంత్ర స్పా కేంద్రంపై పోలీసులు దాడులు చేసి విటుడు, నిర్వాహకురాలను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఒక అపార్టుమెంట్‌లో నిర్వహిస్తున్న తంత్ర స్పా కేంద్రంపై ఫిర్యాదులు రావడంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒక విటుడితోపాటు ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు యువతలను పెందుర్తిలోని శక్తి సదన్‌కు తరలించారు. విటుడిని అరెస్ట్ చేశారు. నిర్వాహకురాలు బండారు నాగసత్యసాయి తేజశ్రీ (28)ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వెండి కిరీటాలు బహూకరణ



శ్రీలలితాపీఠంలో వెండి కిరీటాలతో శ్రీభూ నీలా కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులు

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో కొలువైన శ్రీభూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు గరిశిమెళ్ల ధనుంజయ కుమార్ అనే భక్తుడు వెండి కిరీటాలు చేయించారు. మూడున్నర కిలోల వెండితో, మూడున్నర లక్షల రూపాయల వ్యయంతో ఉత్సవమూర్తులకు కిరీటాలు చేయించారు. పుష్యమాసం ఆఖరి శనివారం సందర్భంగా ఉత్సవ మూర్తులకు వెండి కిరీటాలు అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం సుప్రభాత సేవ, సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- మాస శివరాత్రి సందర్భంగా శ్రీలలితాపీఠంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యంగిర భద్రకాళి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు.

రహదారి ఆక్రమణతో ట్రాఫిక్ జామ్





శ్రీనగర్ డే అండ్ నైట్ ఆస్పత్రి రోడ్డులో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

సీతంపేట : రామాటాకీస్ సమీపంలో శ్రీనగర్‌లో డే అండ్ నైట్ హాస్పిటల్ రోడ్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో సాయిబాబా ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బడ్డీలు, వ్యాపార దుకాణాలు, కర్రీ పాయింట్స్ వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేసేస్తున్నారు. ఫలితంగా ఇతరుల వాహనాలు వెళ్లే మార్గం లేక తరచూ ట్రాఫిక్‌జామ్ అవుతోంది. ఈ మార్గంలో రోడ్‌ను ఆక్రమించి పదుల సంఖ్యలో బడ్డీలు వెలిశాయి. ఒక వైపు బడ్డీలు, మరొక వైపు కర్రీ పాయింట్స్‌తో వాహన చోదకులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ

సీతమ్మధార : సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ వ్యాపారులను హెచ్చరించారు. సీతమ్మధార రైతు బజార్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు వ్యాపారుల దుకాణాలను పరిశీలించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. సింగిల్ యూజ్డ్ కవర్ల వినియోగాన్ని జనవరి 1 నుంచి నిషేధించినట్లు చెప్పారు. పాలిథిన్ కవర్లపై నగరంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. పర్యావరణహితమైన పేపర్ కవర్లు, నార సంచులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

ఆరిలోవ: రైతు బజార్లలో రైతులకు గుర్తింపు కారుడ్ల తప్పనిసరి అని వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ అన్నారు. ఎంవీపీ రైతుబజార్‌ను శనివారం సందర్శించిన ఆయన రైతులు, వ్యాపారుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాళ్లు పొందినవారు గుర్తింపు కార్డు దగ్గర పెట్టుకొని విక్రయాలు జరపాలన్నారు. రైతు బజార్‌లో కాయగూరలు స్టాళ్లు, కిరాణా షాపులను పరిశీలించారు. డ్వాక్రా, పీహెచ్‌సీ వారి స్టాళ్లను తనిఖీ చేశారు. అన్ని షాపుల వద్ద ధరల పట్టికలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రైతు బజార్ ప్రకటిస్తున్న ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. సందర్శనలో రైతుబజార్ ఈవో వరహాలు, సహాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం వైశాఖి స్పోర్ట్సు పార్కులో గణతంత్ర దినోత్సవం నిర్వహణ అనంతరం సాయంత్రం లోటస్ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ సుగణ దీప్తి పాల్గొంటారని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను శనివారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు, సిబ్బంది విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ సాహుల్, మోట నవీన్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా 6 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

దివ్యాంగుల సమస్యలపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

తాటిచెట్లపాలెం : దివ్యాంగ ప్రయాణికులు ఎదుర్కొనే సమస్యలు, వారికి రైల్వే ఉద్యోగులు, సిబ్బంది అందించాల్సిన చేయూతపై ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైల్వే శాఖ నుంచి వారు ఆశిస్తున్న విషయాలపై విశాఖపట్నం డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ (దివ్యాంగ, ట్రాన్స్‌జండర్, సీనియర్ సిటిజన్స్) మాధవి, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ వెంకటఅప్పారావు వివరించారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో.. ట్రిపుల్ రైడింగ్..



అసలే జాతీయ రహదారి. నిత్యం వందలాది వాహనాలు జోరుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి మార్గంలో కొంత మంది ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్‌లో జాతీయ రహదారిలో ఒక బైక్‌పై ముగ్గురు ప్రయాణించడంతోపాటు రాంగ్ రూట్‌లో దూసుకుపోతున్న దృశ్యమిది. దీంతో ఎదురుగా వచ్చే వాహనదారులు వారిని తప్పించుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. నిత్యం ఈ ప్రాంతంలో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా వాహనదారుల్లోనూ మార్పు రావడం లేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా... ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



ప్రిన్సిపాల్ నారాయణరావు, అధ్యాపకులతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

మురళీనగర్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో స్థానిక విద్యార్థులు ప్రతిభ చూపి అత్యధికంగా ఉద్యోగాలు సాధించారు. చెన్నైకు చెందిన సెయింట్ గోబైన్ గ్లాస్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ కాలేజీలో తృతీయ సంవత్సరం చదువుతున్న 47 మంది విద్యార్థులు రాత పరీక్ష, మౌఖిక పరీక్షల అనంతరం ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో 26 మంది, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 13 మంది, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 8 మందిని ఆ కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

వీరికి కంపెనీ ప్రతినిధుల సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణ రావు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కాలేజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.రత్నకుమార్, స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, ఇతర విభాగాధిపతులు, విభాగాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు జూన్ నెలలో చెన్నైలోని సెయింట్ గోబైన్ పరిశ్రమలో శిక్షణ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు.

ఘనంగా రావిచెట్టు కనకదుర్గమ్మ పరస



ప్రత్యేక అలంకరణలో రావిచెట్టు కనకదుర్గమ్మ తల్లి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని రావిచెట్టు కనక దుర్గమ్మ తల్లి పరస మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కాలనీ పరిసర ప్రాంతాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నేల వేషాలు, సాముగరిడీ, భజనలు నిర్వహించారు. కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని, వీధులను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ దుంగి కనక మహాలక్ష్మి, కాలనీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. పరస మహోత్సవం కారణంగా కాలనీ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

వైభవంగా పంచాయతన యాగ మహోత్సవం

ఎంవీపీకాలనీ: శ్రీ సరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శ్రీ శారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.సాయికాంత్ శర్మ దంపతులు, వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో యాగాలను నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీ సుదర్శన హవనం, హయగ్రీవ మూలమంత్ర హవనం, మండపారాధన నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పాటు పలు మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, సాంస్కృతిక నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.